www.vishalabharati.com
epaper:vishalabharati.com

TELANGANA POLITRICKS

పాలిట్రిక్స్ 2023-2024

విశాల భారతి
vishalabharathi Telugu Daily

సోమవారం, 26.09.2023 హైదరాబాద్

1.00 pm edition




పాలిట్రిక్స్



# కవర్లో క్యాండిడేట్స్!

30 కి పైగా నియోజకవర్గాల్లో కమిటీ ఏకాభిప్రాయం

నేటి నుంచి పీఈసీ మెంబర్లతో స్క్రీనింగ్ కమిటీ మీటింగ్స్

కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపికలో ప్రదేశ్ ఎన్నికల కమిటీ బిజీ

సీల్డ్‌కవర్‌లో సభ్యుల అభిప్రాయాలు సూచనలు సమర్పణ

విశాల భారతి, స్టేట్‌బ్యూరో:

రానున్న ఎన్నికలకు అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను కాంగ్రెస్ ముమ్మరం చేసింది. పార్టీ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తూ 119 నియోజకవర్గాలకు గాను దాఖలైన1006 దరఖాస్తుల వడపోత ప్రక్రియను చేపట్టింది. అందులో భాగంగా ఇప్పటికే టీపీసీసీ ప్రెసిడెంట్ రేవంత్ రెడ్డి అధ్యక్షతన ప్రదేశ్ ఎన్నికల కమిటీ సమావేశమైంది. నియోజకవర్గాల వారీగా దరఖాస్తులను పరిశీలించిన కమిటీ సభ్యులు 30కి పైగా నియోజకవర్గాల్లో ఒకే పేరు పై ఏకాభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఏకాభిప్రాయానికి వచ్చిన వాటిలో సిట్టింగ్ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, పార్టీ ముఖ్య నాయకుల పేర్లు ఉన్నట్లు సమాచారం.

అయితే గత సంప్రదాయానికి భిన్నంగా తమ ప్రాధాన్యాలు వాటికి కారణాలు, సూచనలు ప్రతి సభ్యుడు సీల్డ్ కవర్‌లో సమర్పించారు. కమిటీ సమావేశం ప్రారంభం కాగానే అందులోని 30 మంది సభ్యులకు నియోజకవర్గాల వారీగా 1006 మంది ఆశావహులు, పార్టీకి వారు చేసిన సేవలు, వారి రాజకీయ సామాజిక నేపథ్యం తదితర వివరాలను పంపిణీ చేశారు. ఆ వివరాల ఆధారంగా ప్రతి నియోజకవర్గంలోనూ ప్రతి సభ్యుడు తొలి, మలి, మూడు కొన్ని సందర్భాల్లో నాలుగు ఐదో ప్రాధాన్యాలు నిర్వహించినట్లు తెలిసింది. ఆయా ఆశావహులకు ఆయా ప్రాధాన్యాలు ఎందుకు నిర్ణయించారో.. వివరణ, తగు సూచనలు పేర్కొన్నారు. 30 పైగా నియోజకవర్గాలకు సంబంధించి తొలి ప్రాధాన్యం నమోదులో మెజార్టీ సభ్యులు ఏకాభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. స్క్రీనింగ్ కమిటీ సంప్రదింపులు జరిపి ఏకాభిప్రాయం వచ్చిన అభ్యర్థులతో ఈ నెల ఒకటి లేదా రెండో వారంలో ఫస్ట్ లిస్ట్ రిలీజ్‌చేసే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. మెజారిటీ సభ్యులు ఏకాభిప్రాయం వెలిబుచ్చిన అభ్యర్థుల్లో సిట్టింగ్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ పార్టీ ముఖ్య నాయకులు ఉన్నట్లు చెబుతున్నారు. ఉదాహరణకు నాగార్జునసాగర్ నియోజకవర్గంలో మాజీ మంత్రి జానారెడ్డి టికెట్‌కోసం దరఖాస్తు చేసుకోలేదు. అయితే ఆ నియోజకవర్గం నుంచి జానారెడ్డి అభ్యర్థి అయితేనే బాగుంటుందంటూ మెజార్టీ సభ్యుల అభిప్రాయాన్ని నమోదు చేసినట్లు తెలుస్తోంది. నియోజకవర్గానికి ఒకటి నాలుగు వరకు పేర్లు రేసులో మిగలనున్నాయి.

**నేటినుంచి సీలింగ్ కమిటీ కసరత్తు**

మురళీధరన్ చైర్మన్‌గా, జిగ్నేశ్ మేవానీ, సిద్ధిఖీ సభ్యులుగా ఏర్పాటైన స్క్రీనింగ్ కమిటీ సోమవారం నుంచి మూడు రోజుల పాటు ప్రదేశ్‌ఎన్నికల కమిటీ సభ్యులతో ముఖాముఖి సమావేశం కానున్నారు. ఫీల్డ్ కవర్‌లో ఆయా సభ్యులు ఇచ్చిన ప్రాధాన్యాలు, సూచనలు ఆధారంగా వారు చర్చలు జరుపుతారు. అలాగే ఈనెల 5న డీసీసీ ప్రెసిడెంట్‌మాజీ ఎంపీలు , మాజీ మంత్రితో ముఖాముఖి సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ స్క్రీనింగ్ కమిటీలో ఎక్స్ అఫీషియో సభ్యులుగా పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాకూర్, టీపీసీసీ ప్రెసిడెంట్ రేవంత్ రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఉన్న సంగతి తెలిసిందే. స్క్రీనింగ్ కమిటీ సభ్యులు అఫీషియల్ సభ్యులు 6న సమావేశమై కమిటీ సభ్యులు స్వీకరించిన అభిప్రాయాలు సర్వేలు సామాజిక సమీకరణల ఆధారంగా అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేయనున్నారు. ఈ కసరత్తులోని ఏకాభిప్రాయం వచ్చిన పేర్లతో తొలి జాబితాను రూపొందించి ఆమోదం కోసం ఏఐసీసీ ఎన్నికల కమిటీకి పంపనున్నట్లు ప్రచారం జరుగుతోంది.

**ఏకాభిప్రాయం వీరికే..**

విశ్వసనీయ సమాచారం ప్రకారం ఏకాభిప్రాయం వచ్చిన పేర్లు.. రేవంత్ రెడ్డి( కొడంగల్), భట్టి విక్రమార్క (మధిర), ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, (హుజూర్‌నగర్) కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి (నల్లగొండ) , జగ్గారెడ్డి (సంగారెడ్డి), శ్రీధర్ బాబు (మంథని), సీతక్క (ములుగు) పోదెం వీరయ్య( భద్రాచలం) జీవన్ రెడ్డి (జగిత్యాల), కొక్కిర్యాల ప్రేమ్ సాగర్ రావు (మంచిర్యాల), సుదర్శన్ రెడ్డి (బోధన్), షబ్బీర్ అలీ (కామారెడ్డి), ఆది శ్రీనివాస్ (వేములవాడ), దామోదర రాజనర్సింహ( అందోల్), ఎ. చంద్రశేఖర్ (జహీరాబాద్), మల్‌రెడ్డి రంగారెడ్డి ( ఇబ్రహీంపట్నం), రామ్మోహన్ రెడ్డి (పరిగి), గడ్డం ప్రసాద్ కుమార్ (వికారాబాద్), ఫిరోజ్ ఖాన్ (నాంపల్లి), సంపత్ కుమార్ (అలంపూర్), వంశీచంద్‌రెడ్డి(కల్వకుర్తి), జూపల్లి కృష్ణారావు (కొల్లాపూర్), పద్మావతి రెడ్డి (కోదాడ), దొంతి మాధవరెడ్డి (నర్సంపేట్), కొండా సురేఖ (వరంగల్ ఈస్ట్), గండ్ర సత్యనారాయణ రావు ( భూపాల్ పల్లి) తదితరులు ఉన్నారు.

# కేసీఆర్ సీక్రెట్ సర్వే!

## అభ్యర్థుల ప్రకటన తర్వాత గులాబీ బాస్ యూటర్న్!

కాంగ్రెస్, బీజేపీ బలంగా ఉన్న సీట్లపై స్పెషల్ ఫోకస్

వీధికెక్కుతున్న 'కారు' లీడర్ల పంచాయితీలు

వారిని మార్చాల్సిందేనని హైకమాండ్‌కు వార్నింగ్ సైరన్లు

సర్వే వార్తలతో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల గుండెల్లో గుబులు

ఆశావహులు, టికెట్‌రాని సిట్టింగుల్లో చిగురిస్తున్న ఆశలు



**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో 115 మంది అభ్యర్థులను ప్రకటించిన బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ యూ టర్న్ తీసుకోనున్నారా? ఇప్పటికే సీట్లను ఖరారు చేసిన వారిలో కొందరిని మార్చే అవకాశం ఉందా? ఓటమి భయంతో కేసీఆర్ మరోసారి సీక్రెట్ సర్వే నిర్వహించారా? ముఖ్యంగా కాంగ్రెస్, బీజేపీ పార్టీలు బలంగా ఉన్న 24 అసెంబ్లీ నియోజకవర్గాలపై కేసీఆర్ ప్రత్యేకంగా నిఘా పెట్టారా..? అన్న విషయాలపై పొలిటికల్ సర్కిల్‌లో చర్చ నడుస్తోంది. ఇటీవల బీఆర్‌ఎస్ అధినేత ప్రకటనలు కూడా ఇవి అక్షరాలా నిజమేనని చెబుతున్నాయి. మరోవైపు మంత్రి కేటీఆర్ బ్యాచ్ సీట్లను ఇస్తారా? లేదా ఇతర మార్గాలను చూసుకోవాలా? అనే సందేశాలను పంపుతూ పొలిటికల్‌హీట్ పెంచుతున్నారు.

**బెడిసి కొడుతున్న పెద్ద సారు వ్యూహాలు**

కాంగ్రెస్, బీజేపీలకు చెక్ పెట్టేందుకు బీఆర్‌ఎస్‌పెద్ద సారు ఒకేసారి 115 మంది అభ్యర్థులను ప్రకటించి వ్యూహాత్మకంగా అడుగులేసిండు. కానీ అది రాను రాను బెడిసి కొడుతున్నట్లు కనిపిస్తోంది. జాబితా ప్రకటన రాగానే నియోజకవర్గాల్లో వర్గపోరులు వీధికెక్కాయి. సిట్టింగ్‌లు, టికెట్ ఆశించిన ఆశావాహుల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గమనే పరిస్థితి ఉంది. మరోవైపు పార్టీలో కీలక నేతలు తీవ్ర అసంతృప్తి, ఆగ్రహానికి లోనయ్యారు. వీరిలో కొందరు కాంగ్రెస్, బీజేపీల నేతలకు టచ్ లోకి పోయారు. తుమ్మల వంటి నేతలకు బాహాటంగానే ఆహ్వానాలు అందుతున్నాయి. ఇక సీట్లు ఖరారు కాని సిట్టింగులు, ఆశావాహులు వరుసగా సమావేశాలు పెడుతూ కారు పార్టీకి అల్టిమేటం జారీ చేస్తున్నారు. ఇదిలా ఉంటే.. వారికి ఎందుకు టికెట్ ఇచ్చారని, ఆ అభ్యర్థులను మార్చాల్సిందేనని అధిష్టానానికే వార్నింగ్ సైరన్లు మోగిస్తున్నారు.

**చివరి నిమిషంలో ప్రకటన**

బీఆర్‌ఎస్ లోని సొంత పార్టీ నేతలు తిరుగుబాటు చేస్తుండటం, రహస్య సమావేశాలు ఏర్పాటు చేస్తుండటం, కాంగ్రెస్, బీజేపీ వైపు పలువురు అడుగులేస్తుండటం లాంటివి చూసి గులాబీ బాసుకు మైండ్ బ్లాక్ అయితుందట. దీంతో సీక్రెట్ సర్వే చేసి.. భీ ఫారాలను అందజేయాలని నిర్ణయించుకున్నారట. అయితే విశ్వసనీయవర్గాలు, బీఆర్‌ఎస్ వర్గాల నుంచి అందుతున్న సమాచారం మేరకు కేసీఆర్ ప్రకటించిన జాబితాలోని సుమారు 20 మంది అభ్యర్థులకు ఉద్వాసన పలకడం ఖాయమట. అయితే, వారికి ఇప్పటికిప్పుడు టికెట్లు ఇవ్వమని చెప్పరట. అలా చేస్తే.. పక్క చూపులు చూస్తారని.. తద్వారా క్యాడర్ దెబ్బతింటుందనే ఉద్దేశంతో గులాబీ బాస్ ఉన్నారని తెలుస్తోంది. చివరి నిమిషంలో టికెట్ రాక తిరుగుబాటు చేసినా నష్టం అంతగా ఉండదని బీఆర్‌ఎస్ బాస్ భావిస్తున్నారట.

**అభ్యర్థులపై తీవ్ర వ్యతిరేకత**

కేసీఆర్ రహస్య సర్వేలో కొన్ని నియోజకవర్గాల్లో పార్టీ కుమ్ములాటలు, క్యాడర్ అసంతృప్తి, ఆయా అభ్యర్థులపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత కారణంగా ఓటమి భయం ఉందని తేలినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా కోదాడ, ఇల్లందు, నాగార్జున సాగర్, ఉప్పల్, అసిఫాబాద్, మహబూబాబాద్, బెల్లంపల్లి, మంథని, కొత్తగూడెం, వరంగల్ ఈస్ట్, మల్కాజిగిరి, కల్వకుర్తి, పెద్దపల్లి, రామగుండం, కంటోన్మెంట్, మానకొండూర్‌తో ఉమ్మడి ఖమ్మంలోని ఇంకొన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులపై తీవ్ర వ్యతిరేకత ఉందట. దీంతో ఈ స్థానాల్లో టికెట్లు దక్కించుకున్న నేతల్లో టెన్షన్ మొదలైంది. అయితే ఇప్పటికే ఆయా స్థానాల్లో ఎవరిని నియమిస్తే బాగుంటుందని కేటీఆర్ టీమ్ రంగంలోకి దిగిందట. పనిలో పనిగా తన అనునాయులలో కీలక వ్యక్తులను రంగంలోకి దించేందుకు మార్గాలు క్రియేట్ చేస్తున్నారని సమాచారం. తాజా వార్తల నేపథ్యంలో టికెట్లు ఆశించిన ఆశావహులు, సిట్టింగుల్లో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయట. వీటిల్లో వాస్తవం ఎంత ఉందో తెలాలంటే మరికొన్ని రోజులు ఆగాల్సిందే

### ఎమ్మెల్యేల్లో గుబులు

'ఈ జాబితాలోని 115 మంది అభ్యర్థులు ఫైనల్ కాదు.. ముమ్ముందు మార్పులు, చేర్పులు కచ్చితంగా ఉంటాయి' అని అభ్యర్థుల జాబితా ప్రకటించిన రోజే కేసీఆర్ క్లియర్ కట్‌గా చెప్పేసారు. దీంతో తాజాగా వైరల్ అవుతున్న వార్తలకు మరింత బలం చేకూరింది. ఈ వార్తల నేపథ్యంలో టికెట్ దక్కించుకున్నా.. కొందరు ఎమ్మెల్యేల్లో గుబులు మొదలైందట. అయితే సీక్రెట్ సర్వే వార్తలతో అధికారపార్టీ ఎమ్మెల్యేల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయట. ఎప్పుడు ఎలాంటి ప్రకటన వస్తుందోనని టికెట్ దక్కించుకున్న నేతలు ఆందోళనలో పడ్డారు. టికెట్ వచ్చిన ఆనందం కూడా వారిలో లేదని పార్టీ శ్రేణులు చర్చించుకుంటున్నారు. మరోవైపు సీటు రాని బలమైన గులాబీ నేతలను తన ఖాతాలో వేసుకునేందుకు బీజేపీ, కాంగ్రెస్ పెద్దలు రంగంలోకి దిగారు. ఇప్పటికే చాలామంది నేతలు వారి టచ్‌లోకి కూడా వెళ్లినట్లుగా వార్తలు వస్తున్నాయి. ఇక దుబాయ్ లో ఉన్న మంత్రి కేటీఆర్ త్వరలోనే హైదరాబాద్ రానున్నారు. ఆయన వచ్చాక సీట్ల పంచాయతీ మళ్లీ ప్రారంభం కానుందని తెలుస్తోంది.

# 'జమిలి' ఇప్పుడొడిసే ముచ్చటేనా?

**దేశంలో జమిలి ఎన్నికల నిర్వహణపై జరుగుతున్న చర్చ శుక్రవారం అనూహ్య మలుపు తీసుకుంది. ఈ 'ఒకే దేశం - ఒకే ఎన్నికల' నిర్వహణ సాధ్యాసాధ్యాల పరిశీలనకు మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో ఓ కమిటీని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. పార్లమెంట్ ను అత్యవసరంగా ఈనెల 18 –-22 వరకు సమావేశపరుస్తోంది కేంద్రం. లోక్‌సభకు ముందస్తు ఎన్నికలు జరగొచ్చని ఊహాగానాలు వెలువడుతున్న తరుణంలో మోదీ ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. మరో మూడు నెలల్లో తెలంగాణతోపాటు అసెంబ్లీ ఎన్నికలు జరిగే రాష్ట్రాలతో లోక్‌సభకు కూడా ఎన్నికలు జరపడం కోసం కమిటీని కేంద్రం ఏర్పాటు చేసింది. కేంద్రం నిర్ణయాన్ని ఇప్పటికే 'ఇండియా' కూటమిలోని ప్రతిపక్ష పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయి.**

మోదీ ప్రభుత్వం వడివడిగా అడుగులు

పార్లమెంట్ అత్యవసర భేటీతో ప్రాధాన్యం

మాజీ రాష్ట్రపతి కోవింద్ కమిటీ ముందడుగు

'జమిలీ' కమిటీపై న్యాయశాఖ నోటిఫికేషన్ రిలీజ్

తీవ్రంగా వ్యతిరేకిస్తున్న 'ఇండియా' పక్షాలు

రాజకీయ ఏకాభిప్రాయ సాధ్యంపై అనుమానాలు

1951 ప్రజా ప్రాతినిధ్య చట్టానికి సవరణలు చేయాలి

సవరణలకు పార్లమెంటు ఆమోద ముద్ర వేయాలి

అంత ఈజీ కాదంటున్న రాజకీయ విశ్లేషకులు



### ప్రధాన అడ్డంకులు

దేశంలో జమిలి ఎన్నికలన నిర్వహించాలంటే రాష్ట్ర ప్రభుత్వాలను ఒప్పించాల్సి ఉంటుంది. అలాగే రాష్ట్రా ప్రభుత్వాల కాలపరిమితి కూడా ప్రధానమైనదేనని, వాటి మాటకు విలువ ఉంటుందని రాజ్యాంగ నిపుణులు చెబుతున్నారు. జమిలి కోసం వాటిని కుదించటాన్ని ఎన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు అంగీకరిస్తాయో లేదో చూడాలి. మరోవైపు రాజ్యాంగ సవరణలకు పార్లమెంటు 2/3 మెజార్టీతో ఆమోదించాల్సి ఉంటుంది. దేశంలోని సగం రాష్ట్రాల అసెంబ్లీలు కూడా అమోదిస్తూ తీర్మానించాలి.

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

లక్ష్యాన్ని చేరేందుకు అనేక అడ్డంకులు కేంద్ర ప్రభుత్వం 'ఒకే దేశం - ఒకే ఎన్నిక విధానం' వైపు అడుగులు వేస్తుండంతో దేశవ్యాప్తంగా ఇప్పుడు జమిలి ఎన్నికల అంశంపై జోరుగా చర్చలు జరుగుతున్నాయి. మరోవైపు రాజకీయ పార్టీలన్నీ జమిలిపై దృష్టిసారించాయి. కొన్ని రాజకీయ పార్టీలు మరో అడుగు ముందుకేసి అంతర్గత కమిటీలు వేశాయి. మరోవైపు మోదీ ప్రభుత్వం లక్ష్యాన్ని చేరేందుకు చాలా సమస్యలు అధిగమించాల్సి ఉంటుందని పొలిటికల్ విశ్లేషకులు పేర్కొంటున్నారు. గతంలో లా కమిషన్, పార్లమెంటు స్థాయీ సంఘం జమిలి ఎన్నికలకు మద్దతుగా రిపోర్టులు ఇచ్చినప్పటికీ ఇందులో ఆర్థిక, రాజకీయ, రాజ్యాంగ, చట్టపరమైన అంశాలను అధిగమించాల్సిన అవసరం ఉంటుందని స్పష్టం చేశాయి. తొలుత రాజకీయ ఏకాభిప్రాయం సాధిస్తే మిగిలిన అడ్డంకులు అధిగమించడం సాధ్యమవుతుందన్న అభిప్రాయాన్ని దేశ వ్యాప్తంగా ఉన్న నిపుణులు వ్యక్తం చేస్తున్నారు.

**దూకుడుగా న్యాయశాఖ**

మరోవైపు జమిలి ఎన్నికల కమిటీపై న్యాయశాఖ దూకుడుగా పోతుంది. 8 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ చైర్మన్‌గా మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను నియమించింది. కేంద్ర మంత్రి అమిత్‌షా, లోక్‌సభలో విపక్ష నేత అధీర్ రంజన్ చౌదరి, గులాం నబీ ఆజాద్, 15వ ఆర్థిక సంఘం మాజీ ఛైర్మన్ ఎన్‌కే సింగ్, లోక్‌సభ మాజీ సెక్రెటరీ జనరల్ సుభాష్ కశ్యప్, సీనియర్ న్యాయవాది హరీశ్ సాల్వే, మాజీ చీఫ్ విజిలెన్స్ కమిషనర్ సంజయ్ కొఠారీలను కమిటీలో సభ్యులుగా ఉన్నారు. ప్రత్యేక ఆహ్వానితుడిగా కేంద్ర మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్, కమిటీ సెక్రెటరీగా కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి నితిన్ చంద్రలకు బాధ్యతలు అప్పగించింది. కమిటీ తక్షణమే పని ప్రారంభించాలని న్యాయశాఖ ఆదేశించింది. వీలైనంత త్వరగా నివేదిక ఇవ్వాలని మోదీ ప్రభుత్వం ఆదేశించింది.

**అనుకున్నంత సులభం కాదు**

జమిలి ఎన్నికలంటే దానికి చాలా కసరత్తు చేయాల్సి ఉంటుంది. పార్లమెంటుతో పాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకూ ఎన్నికలు నిర్వహించాలి. ప్రస్తుత పరిస్థితుల్లో వివిధ రాష్ట్రాల అసెంబ్లీల అధికారిక గడువులు వేర్వేరుగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో జమిలి ఎన్నికలను నిర్వహించాలంటే కొన్ని రాష్ట్రాల అసెంబ్లీల గడువును పెంచడంతో పాటు మరికొన్నింటివి తగ్గించాల్సి ఉంటుంది. మరోవైపు లోక్‌సభ ముందస్తు ఎన్నికలకు వెళ్లినా ఈ మార్పులు తప్పనిసరి చేయాలని నిపుణులు తెలిపారు. ఇవన్నీ అనుకున్నంత సులభం కాదని వారంటున్నారు. ఇందుకు రాజ్యాంగ పరంగా కొన్ని సమస్యలు ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. వీటన్నింటిని అధిగమించాలంటే దేశంలో వివిధ ఎన్నికల నిర్వహణ తీరుతెన్నులు, మార్గదర్శకాలకుద్దేశించిన 1951 ప్రజాప్రాతినిధ్య చట్టానికి సవరణలు చేయటంతోపాటు... పలు కీలకమైన రాజ్యాంగ సవరణలకు పార్లమెంటు ఆమోదముద్ర వేయాల్సి ఉంటుందని గుర్తుచేస్తున్నారు.

**1967 నుంచి చర్చలు**

దేశంలో జమిలి ఎన్నికలను నిర్వహించాలని 1967 నుంచి వాదనలు ఉన్నాయి. కానీ ఇప్పటి వరకూ సాధ్యం కాలేదు. నరేంద్ర మోదీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన 2014 నుంచి జమిలి ఎన్నికలపై జోరుగా ప్రచారం అవుతున్నది. తరచూ ఎన్నికలు జరుగుతుండటం వల్ల దేశంపై ఆర్థిక భారం పడటంతో పాటు, పోలింగ్ సమయాల్లో అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతోందనేది మోదీ ప్రభుత్వం వాదన. ఈ నెల 18 22 వరకూ అయిదు రోజుల పాటు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నట్లు ప్రకటన వచ్చిన మరుసటి రోజే జమిలి ఎన్నికల కోసం కమిటీ ఏర్పాటు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

**జమిలిపై గతంలో అధ్యయనాలు**

జమిలి ఎన్నికలపై గతంలో పలు కమిటీలు వేశారు. అవి సుదీర్ఘంగా అధ్యయనం చేసి నివేదికలను అందజేశాయి. జస్టిస్ బి.పి.జీవన్‌రెడ్డి నేతృత్వంలోని లా కమిషన్ 1999లో ఎన్నికల చట్టాల సంస్కరణలపై ఇచ్చిన 170వ నివేదికలో జమిలి ఎన్నికలు నిర్వహించాలని చెప్పింది. 2015 డిసెంబర్‌లో న్యాయశాఖ పార్లమెంటరీ స్థాయీసంఘం 79వ నివేదికలోనూ దీని గురించి తెలిపింది. 2017 నవంబర్‌లో అప్పటి నీతిఆయోగ్ సభ్యుడు, ఓఎస్‌డీ వివేక్ దేబరాయ్, కిశోర్ దేశాయ్‌లు జమిలి ఎన్నికలపై నీతిఆయోగ్ తరపున అధ్యయనం చేసి నివేదికలు సమర్పించారు.

**ఈ రాజ్యాంగ సవరణలు కీలకం**

జమిలి ఎన్నికలు జరపాలంటే అధికరణం 83 (లోక్‌సభ, రాజ్యసభల కాలపరిమితికి సంబంధించింది), అధికరణం 83(2)11 (లోక్‌సభ ఐదేళ్ల గడువు కుదింపు), అధికరణం 172(1) (రాష్ట్రాల అసెంబ్లీల గడువు, అధికరణం 83(2) అత్యయిక సమయం , అధికరణం 172(1) రాష్ట్రాల అత్యయిక స్థితి మార్పు, అధికరణం 85(2)(బి) రాష్ట్రపతి లోక్‌సభ రద్దు అధికారాలు, అధికరణం 174(2)(బి) గవర్నర్‌రాష్ట్ర అసెంబ్లీల రద్దు అధికారం, అధికరణం 356 (రాష్ట్రాల్లో రాష్ట్రపతిపాలన) లలో సవరణ చేయాల్సిన అవసరం ఉంటుందని రాజ్యాంగ నిపుణులు తెలిపారు. ఇందుకు కేంద్రం, రాష్ట్రాలు కలిసి నిర్ణయం తీసుకుంటేనే ఈ సవరణలు సాధ్యమయ్యే అవకాశం ఉందంటున్నారు. లేదంటే ఈ ప్రక్రియలకు చాలా సమయం పట్టడంతోపాటు కేంద్రంరాష్ట్రాల సంబంధాల్లో వివాదాలు తలెత్తే అవకాశం ఉంటుందని నిపుణులు అభిప్రాయబడుతున్నారు.